# పునస్సమాగమం

[ సుశ్రీ ]

సుశీలకు నెల రోజులనుండి జబ్బుగావుంది. అంతకు తొలినాటి రాత్రే ఆమెను చూచివచ్చాను ఆయాసం ఎక్కువగా వుంది మాటకూడా కష్టంమీద వస్తోంది డాక్టర్ ఇంజక్షన్ ఇచ్చి నన్ను ప్రక్కగా తీసుకు వెళ్లి లాభం కనిపించదని నసిగాడు

ఆమె కొడుకు రాము పదిహేడేళ్ల వాడు కంటికి మంటికి ఒకే ధారగా ఏడుస్తున్నాడు.

మరుచటి ఉదయం ఆమె నొకసారి చూచి ఆఫీసుకు పోదామని బయలు దేరాను ఇంతలో రాము స్నేహితుడు గోపీ పరుగెత్తుకువచ్చి 'వాళ్ల అమ్మ చచ్చి పోయింది' అని చెప్పాడు.

ఆఫీసు తాళపుచెవులు నా దగ్గరనే వున్నాయి. పంపిద్దామా అంటే ఎవరూ లేకపోయారు మా పిల్లవాడు అయిదు నిమిషాల క్రితమే స్కూలుకు వెళ్లిపోయాడాయె.

అయితే ఓ అరగంట ఆలస్యం అవుతుందని తిన్నగా సుశీల ఇంటికి వెళ్లాను. మా వీధి చివర ఒక సందులో వుంది ఆమె ఇల్లు

* * *

శ్మశాన వాటికనుంచి సరాసరిగా ఆఫీసుకు వెళ్లిపోయాను. తండ్రి ఒక ప్రక్క కొడుకు ఒక ప్రక్క ఖిన్న వదనాలతో ఒకరితో ఒకరు మాట్లాడుకోకుండా కూర్చున్నారు ఇద్దరి హృదయాలు కుమిలిపోతున్నాయని వారి చూపులే సూచించాయి

అగ్నిజ్వాలల మధ్య దగ్ధమై, భస్మమై పోతున్న సుశీల మృతకళేబరం వంక ఒకసారి చూసి, తాళపుచెవులు ఆఫీసుకు పంపే అవకాశం లేక పోవడంవల్ల నా కర్మాన్ని నేనే నిందించుకొని బయలుదేరాను

సుశీల మాట తలచుకొంటూనే ఆఫీసుకు నడిచాను. ఆమె ఎంత అభిమానస్తురాలు! ఎంత మానధనరాలు? ఎంతటి త్యాగశీల ?

పదిహేడేళ్లనుంచి ఆమెను నేను ఎరుగును రోజూ ఏదో ఒక సమాయాన మా ఇంటికి వచ్చి 'అన్నా' అని ఆప్యాయంగా పిలిచి తన కష్ట సుఖాలు చెబుతూవుండేది ఆమె. ఆమె రాకపోతే నేను వెళ్లి చూచేవాణ్ణి

ఆమె అసలు సామాన్య కుటుంబంలో పుట్టింది చిన్నప్పుడు ఇద్దరమూ ఆడుకొన్న రోజులు నా కింకా స్మృతి పథంలో వున్నాయి ఆమె తండ్రి వెంకట్రామయ్యగారు ఏదో చిన్న గుమాస్తాగిరీతో ఏలాగో కాలక్షేపం చేస్తు వుండేవారు తల్లి నరసమ్మగారు సుశీల చేత తీరిక సమయాలలో భారత, భాగవతాలను, ఇతర నీతి కథల పుస్తకాలను చదివించడమేగాక, ఇంటి పనులలో చక్కని తరిఫీజు ఇచ్చింది

తల్లికి మల్లెనే సుశీలకు అభిజాత్యం మెండు. రామాయణ కథలో సీత, రామచంద్రునిచే అడవులకు పంపివేయబడి, ఆ తర్వాత తిరిగి తీసుకురాబడిన సమయంలో అగ్ని పరీక్షానంతరం భూగర్భంలోనికి చొచ్చుకు పోగోరిన ఘట్టం సుశీల హృదయంలో గాఢంగా అంకితమైపోయింది

సుశీల పెద్దదయిన కొలదీ తలిదండ్రులకు ఆమె పెళ్లి మాట ఆందోళనకరంగా పరిణమించింది తండ్రికి కట్నమిచ్చే శక్తి లేదు కట్న మియ్యక పోతే వరుడు కుదరడు. తలిదండ్రుల అవస్థచూసి పూజారి సోమయ్య జాలిపడ్డాడు. సోమయ్య పెళ్లిళ్ల పేరగాడు. వెంకటరామయ్యగారికి వైద్యం తెలుసు. సోమయ్య ఆయన దగ్గర ఎన్నోసార్లు మందులు పుచ్చుకొన్నాడు. ఎర్రని ఏగాణి అన్నా ఎప్పుడూ ఇచ్చిన పాపాన పోలేదు

కాగా అభిమానం కొలదీ సుశీల మెళ్లో ఎలాగో మూడు ముళ్లు పడేటట్లు చెయ్యాలని సంకల్పించాడు. దగ్గరలోనే వుంది రామచంద్ర పురం. ఆవూళ్లో అశ్వత్థ రామయ్యగారి అబ్బాయి అన్నాజీరావు బి. ఏ. చదువు తున్నాడు.

ఆయనతో సోమయ్య సంప్రదించాడు రెండు వేల

రూపాయలు కట్నం మిస్తే ఒప్పు కుంటానన్నాడు. ఇప్పిస్తానని సోమయ్య చెప్పి, ఆయన్నీ, పిల్లవాణ్ణి తీసుకువచ్చి సుశీలను చూపించాడు

సోమయ్య వెంకటరామయ్యగారితో కట్నం విషయం చెప్పి, మూడుముళ్లు పడిపోయాక పిల్లాడు పిల్లను ఏలుకోక ఏం చేస్తాడయ్యా అన్నాడు

ఏం అల్లరి పెడుతాడో, అశ్వత్థ రామయ్య చండశాసను డని ప్రసిద్ధిగదా అని వెంకటరామయ్య వణికాడు

మీకేంభయం లేదు, నేను చెప్పినట్లు చెయ్యండి అని సోమయ్య ముహూర్తం నిర్ణయింప జేశాడు

ముహూర్తం నాడు పెళ్లివారు తరలివచ్చారు వధూ వరులు పీటలమీద కూర్చున్నారు పురోహితుడు, బ్రాహ్మ ణులు మంత్రాలు చదువుతున్నారు

అశ్వత్థరామయ్య "బావగారూ! కట్నం సొమ్ము తెండి" అన్నాడు

వెంకటరామయ్యగారు వియ్యంకుణ్ణి గదిలోకి తీసుకు వెళ్లి రెండు చేతులు పట్టుకుని "బావగారూ! ఇవి చేతులు కావు—కాళ్లు. అనుకున్న ప్రకారం సొమ్ము చేతికి అంద లేదు సెమ్మదిమీద ఒక నెలలో " అని వాక్యం పూర్తి చెయ్యకుండానే అశ్వత్థ రామయ్య "మోసం—మోసం— వంచన! ఎంతమాట—ఆగండి" అంటూ ఇవతలకు చక్కా వచ్చాడు.

ఆయన కళ్లు కోపాగ్ని కణాలను విరజిమ్ముతున్నాయి

"అబ్బాయి! ఆగు! మంగళ సూత్రం కట్టకు" అని ఒక్క కేకవేశాడు.

మగ పెళ్లివారు వెంకటరామయ్యగార్ని నానా మాటలు అనడము, వెంకటరామయ్యగారిపై అభిమానం వున్న గ్రామస్థులు పీటలమీది పెళ్లి చెడగొట్టవద్దని అశ్వత్థరామ య్యగార్ని ప్రాధేయపడడము జరిగింది

కొంత సేపు తర్జన భర్జనలు జరిగాయి చివరకు ఎల్లా గయితేం పదిమంది అశ్వత్థ రామయ్యగారిని బ్రతిమాలి సుముహూర్తం దాటిపోకుండా మంగళ సూత్రధారణ చేయించేశారు.

ఎడమొహాలతోటి పెడమొహాలతోటీ మగ పెళ్లివారు మూడు రోజుల తర్వాత తమ ఊరు చక్కా పోయారు. గృహ ప్రవేశానికి సుశీలనుకూడా తీసువెళ్లారు. అక్కడ వున్న మూడు రోజులు అత్తమామల సాధింపు విన లేక ఆమె చెవులు గళ్లు పడ్డాయి అయితే అన్నాజీ రావు తలి దండ్రుల ఏవగింపును, క్రోధావేశాన్ని గ్రహించి వుండిన్నీ, ఏదో ఒక వేళ చూచి 'నీకేం భయంలేదు నువ్వు ఏడవకు' అని సుశీలకు ధైర్యం చెబుతూ వుండేవాడు.

మూడు రోజులు గడిచాయి నాల్గవనాడు పురోహిత బ్రాహ్మణ్ణి సాయమిచ్చి కోడలిని పుట్టింటికి పంపిస్తు, అశ్వత్థ రామయ్యగారు ఒక వుత్తరంకూడా రాసి పంపించాడు.

"ఇక మీకు మాకు ఇంతతో సంబంధం సరి. మీరుచేసిన వంచనకు ప్రతీకారంగా మా అబ్బాయికి మళ్లీ పెళ్లి చేస్తాం. మీరు ఏం జేసుకున్నా మాకు విచారం లేదు కోర్టుకు వెళ తారా, కానీండి ఆ తమాషాకూడా చూద్దాం" అని వుంది ఆ వుత్తరంలో

ఆ లేఖ చదువుకుని నరసమ్మగారు వెంకటరామయ్య గుండెలు బాదుకొని గొల్లుమన్నారు తలిదండ్రులను ఓదార్చి, తన భర్త తన కిచ్చిన అభయాన్ని గురించి సుశీల చెప్పింది

సుశీల పుష్పవతి అయింది తలిదండ్రులు కబురు పంపారు అశ్వత్థ రామయ్యకు శుభలేఖ తీసుకు వెళ్లిన బ్రాహ్మణుణ్ణి భోజనానికైనా వుండమనకుండా అవమానించి పంపా డాయన

## కథానిక

అయితే ఒక నాడు అకస్మాత్తుగా అన్నాజీరావే ప్రత్య క్షమైనాడు సుశీల తలిదండ్రుల ముఖాలు అతణ్ణి చూడగానే ఆనందంతో వికసించాయి

తనకు ఏదైనా ఉద్యోగం కాగానే తండ్రితో పోట్లాడి ఇంట్లోంచి బయటకు వచ్చేసయినా ఆమె నేలు కొంటా

నని, అన్యాయం చెయ్యనని అన్నాజీ రావు ప్రమాణం చేశాడు

అది మొదలుకొని రహస్యంగా నాలుగేసి రోజులకు ఒక సారి వస్తువుండేవాడు మంగాపురం వంక కన్నెత్తి చూస్తివా నీకు నేను, నాకునువ్వు లేవు అన్న తండ్రి ఆజ్ఞను అతిక్రమించి అతడు వస్తున్నాడని నరసమ్మగారికీ వెంకటరామయ్య గారికి తెలుసు

ఇలా కొన్ని మాసాలు గడిచి పోయాయి కూతురుకు నెల తప్పిందని తల్లి గ్రహించింది అల్లుడు రహస్యంగా తమ ఇంటికి వస్తున్నా, మీదు మిక్కిలి వచ్చిన సందర్భంలో అశ్వత్థ రామయ్య గారికి తెలియ జేయక పోతే అప్రతిష్ఠ తప్పదని దంపతులు నిశ్చయించుకొని, ఆయనకు ఒక ఉత్తరం రాశారు

దానితో సుశీల దుర్దినాలు ప్రారంభమైనాయి

అశ్వత్థరామయ్యగారు ఆ ఉత్తరం చూచుకొని ప్రళయ కాల రుద్రునివలె మండిపడ్డాడు కోడలిని గురించి నానా దుర్భాషలు ఆడాడు తనకు విధేయుడుగా వుంటూ—అడుగులకు మడుగులొత్తుతున్న కొడుకు తనకు తెలియకుండా అత్తవారింటికి వెళ్లాడంటే, నమ్మను గాక నమ్మనన్నాడు

ఆయన హంగామా చూసి అన్నాజీరావు హడలిపోయి, ఏం చెయ్యాలో తెలియక తికమక పడ్డాడు

ఈ విషయంలో పదిమందినీ పిలిచి పంచాయితీ జరపాలన్నాడు అశ్వత్థరామయ్య. రామచంద్రపురం పెద్దలు కొందరు, మంగాపురంలోని వారు కొందరు సమావేశమయ్యారు. అశ్వత్థ రామయ్యగారు అన్నాజీ రావును వెంట బెట్టుకువచ్చాడు

వెంకటరామయ్యగారు, భార్యను కూతురును వెంటబెట్టుకుని కరణంగారి ఇంటికి వెళ్లాడు అక్కడే పంచాయతీ

కరణంగారు అన్నాజీరావును పిలిచి "అబ్బాయి అన్నాజీ రావు! నీ మాట మీదనే ఆ పిల్ల అదుగో అలాచూడు—ఎలా ఏడుస్తువుందో, ఆ అమాయికురాలి జీవితం అంతా ఆధారపడి వుంది. పెళ్లయిన తర్వాత నువ్వు రహస్యంగా మీ అత్తవారింటికి వచ్చేవాడవా, లేదా?" అని అడిగాడు

కళ్లనుంచి అగ్నిస్ఫులింగాలను రాలుస్తున్న తండ్రిని ఒక సారి—మూర్తిభవించిన శోకంవలె కృంగి పోయివున్న సుశీలను ఒకసారి చూసి అతడు 'రాలేదు' అన్నాడు.

'ఆఁ! రాలేదూ' అని ఏడుస్తునే సుశీల అడిగింది.

అన్నాజీ రావు గాలిలోని ఆకువలె గజగజ వణికి పోయాడు తండ్రి 'చెప్పు నిజం' అని ఉరిమాడు

'లేదు' అన్నాడు అతడు మళ్లీ

ఆ మాట విని ఒక్క కేకవేసి సుశీల మూర్ఛపోయింది.

'ఛీ! దౌర్భాగ్యుడా! అబద్ధ మాడతావు ఇంత చదువు చదివి నువ్వు రావడం నా కళ్లార చూశా' నన్నాడు కరణం

మూర్ఛనుంచి సుశీల తేరుకొనడంతోనే ఆమెలో ఒక మార్పు కనిపించింది ఆమె ముఖంలో ఒక దృఢ సంకల్పం దృగ్గోచరమయింది. నవలావణ్యంతో మిసమిస లాడుతూ వున్న ఆ ముగ్ధ—ఒక్క సారిగా ఎన్నో ఏళ్లు గడిచిన మనిషిలా మారిపోయింది.

ఆ రోజు మొదలు ఆమె తన భర్త పేరు ఎప్పుడూ తల పెట్టలేదు తలిదండ్రులు ఎప్పుడైనా ఆ ప్రసక్తి తెచ్చినా, వెంటనే వద్దనివారించేది

తొమ్మిది మాసాలు గడిచిన తర్వాత ఆమె మగశిశువును కన్నది అతనికి తన ఇష్టదైవం రామచంద్రుని పేరు పెట్టింది. అతడే ఆమెకు సర్వమూను అతని కోసమే ఆమె బ్రతికింది

కొన్ని సంవత్సరాల తర్వాత ఆమె తలిదండ్రులు మరణించారు అప్పటికి కొన్ని రుణాలు పెరగ్గా, ఇల్లు అమ్మివేసింది అప్పులు తీర్చి, మా ఇంటికి కొంచెం దూరంలోని మరొక పూరింట్లో నివసించసాగింది

రామును పెంచడానికి, చదువు చెప్పించడానికి ఆమె ఎంతో యాతనపడింది. కుట్టుపని చేసేది. ఒక రిద్దరి ఇళ్లలో కొంత చాకిరీకూడా చేసేది

# పునస్సమాగమం

అన్నాజీరావు ఒకటి రెండు సార్లు ఆమెకు తన పశ్చాత్తాపం వెల్లడిస్తు వుత్తరాలు వ్రాశాడు తండ్రి గతించిన తర్వాత స్వయంగా క్షమార్పణ వేడుకుందామని వచ్చాడు కూడా

కొడుకు వచ్చి ఆయన ఎవరో వచ్చారని చెప్పగా, అతణ్ణి చూడడానికే ఆమె నిరాకరించింది అతడు మరొకసారి రాగా తలుపు వెనక నిలబడి "నన్ను ఆ నాడు పది మందిలో కులటగా నిర్ణయించి, అవమానించిన వ్యక్తితో ఈ జన్మకు నేను మళ్లీ సంబంధం పెట్టుకోతలచుకోలేదు" అని ఖచ్చితంగా చెప్పింది

అతడు తడబడిన అడుగులతో వెళ్లిపోగానే ఆమె కళ్లు అశ్రుమయములైనాయి

కొడుకు బడినుంచి రాగానే కూర్చోబెట్టి తన విషాద గాధనంతా చెప్పివేసింది పాపం అతని మనస్సులో రేగిన చిచ్చును ఆపుకోలేక పోయాడు కాబోలు, నా దగ్గరకు వచ్చి, తల్లి చెప్పినది యావత్తూ పునశ్చరణచేసి 'అటువంటి కఠినాత్ముణ్ణి నా తండ్రి అనుకోవడంకూడా నాకు సిగ్గే' అన్నాడు.

ఆ మాట నాకు కొంచెం కష్టం కలిగించింది. 'మీ అమ్మకుకూడా మీ నాయన పట్ల ఇలాటి భావమేనా వుంటా' అని అడిగాను

'లేదు. అమ్మ ఆయన్ని ఏమీ అనదు దేముడల్లే భావించి, పూజిస్తుంది' అన్నాడు రాము

భర్తను వదిలి వేసిన తర్వాత 17 సంవత్సరాలు పాటు పడిన యాతనవల్ల, ఆవేదనవల్ల, ఆమె ఆరోగ్యం చెడింది చివరకు మంచ మెక్కింది రాము చదువు మానేసి, ఏదో పని చేస్తు రోజుకు ఓ రూపాయి తెస్తున్నాడు.

ఇలా వుండగా ఒక నాటి సాయంకాలం రాము వచ్చి అమ్మ రమ్మన మంది అన్నాడు

ఆమె మంచంమీదనుంచి లేవబోగా వద్దని, దగ్గర నేవున్న ముక్కాలు పీటపై కూర్చుని 'ఎలా వుంది తల్లీ' అన్నా.

గద్గదస్వరంతో డాక్టరు మందు ఇస్తున్నా తగ్గటం లేదనీ, తనకికబ్రతికే ఆశ లేదనీ చెప్పింది

'అన్నా! ఇక రెండు యీడు రోజుల కంటె ఎక్కువ బ్రతకను ఒకసారి ఆయనను పిలుచుకునిరా ఆయనను కడసారిగా చూస్తాను ఆయన ఆశీర్వదిస్తే—నా ఆత్మకు శాంతి అభిజాత్యమే మమ్మల్ని వేరు చేసింది. ఇప్పుడైనా ఒకసారి చూస్తా' నంది

'ఎందు కమ్మా ఇప్పుడాయన?' అన్నాడు రాము

'నీకు తెలియదు నాన్నా ఆయన క్షమాభిక్ష కోరుకోనీ' 'అన్నా! వాణ్ణి వెంటపెట్టుకు వెళ్లి తీసుకురా' అంది సుశీల

ఇద్దరము వెళ్లి అన్నాజీరావును తీసుకు వచ్చాము. అతడు మళ్లీ పెళ్లి చేసుకోనే లేదు పాపం బక్క చిక్కి శల్యావశిష్టుడై, శిరోజాలు నెరిసిపోయి వున్నాడు సుశీలను చూడగానే అతని కళ్లలో నీళ్లు గిర్రున తిరిగాయి

నేను కూర్చున్న ముక్కాలి పీటమీదనే కూర్చోగా, ఆమె అతని పాదాలను స్పృశించి, తన నయనాంజలినుంచి జాలువారిన దుఃఖాశ్రువులతో వాటిని తడిపింది

'నన్ను క్షమించండి మళ్లీ జన్మలోనైనా మీరే నాకు ' ఇక చెప్ప లేక పోయింది

అతడు వెక్కి వెక్కి ఏడ్చాడు ఎందుకు నా మీద పగబూనావు చెప్పు అన్నాడు

'ఆ నాడు నన్ను అవమానించారని' అంటూ ఆమె ముఖం మరోవైపు త్రిప్పివేసుకుంది

* * *

మరునాటి ఉదయమే ఆమె మరణించింది.

శ్మశాన వాటికలో ఆమె మృతకళేబరాన్ని అగ్నిజ్వాలలు భస్మీభూతం చేస్తున్నంత సేపు తండ్రి, కొడుకూ ఒకరికొకరు పదిగజాల దూరంలో కూర్చుని వున్నారు

ఒకరితో ఒకరు మాట్లాడుకో లేదు వారు అలా వుండగానే నేను ఆఫీసుకు వెళ్లిపోక తప్పని సరి అయింది

ఆ తర్వాత ఇద్దరూ నా దగ్గరకు వచ్చారు నేను అడక్కుండానే నా ప్రశ్నను వారు గ్రహించినట్లు తోచింది.

రాము ఇలా అన్నాడు.

"నా తల్లి భౌతిక దేహాన్ని అగ్నిహోత్రుడు ఒక మూల భస్మం చేస్తువుంటే, నా చెవిలో ఎవరో 'నీ తల్లి క్షమించి క్షమాభిక్ష వేడుకొన్న వ్యక్తిమీద నీకు పగ ఎందుకు?' అని అన్నట్లయింది. ఆయన వయసు మళ్లిందాయె. నేను సేవ చెయ్యవలసిన సమయమిది. ఆయన ఇన్నేళ్లూ ఎంతగా కుమిలిపోయారో గదా!"

గాద్గద్యం చెందిన కంఠంతో అన్నాజీ ఇలా అన్నాడు:

"భాయీ! రాము నా కొడుకు. కన్న కొడుకును ఒక ప్రక్క—నాచే ప్రేమించబడి వంచించబడి, అనేక బాధల పాలై అసువులు వీడిన సతీమణిని మరొకవంక చూడడంతో నాకు అనంతమైన వ్యధకలిగింది, నేనే లేచి 'రానాయనా' అని వాణ్ణి దగ్గరకు తీసుకున్నాను"

"నన్ను వాడి దగ్గరకు వెళ్లమని బహుశా సుశీలే అంతర్వాణియై చెప్పి వుండాలి. అయితే ఒక చిత్రం జరిగింది. ఇద్దరం చెయ్యి చెయ్యి పట్టుకుని నిలబడి వుండగా చితినుంచి రేగుతున్న అగ్నిజ్వాలలు అకస్మాత్తుగా ఆరిపోయినవి. అప్పుడు అక్కడ అపూర్వమైన ప్రశాంతి ఏర్పడినట్లు స్ఫురించింది."

★





బాలికలకు సంగీతము, నాట్యము నేర్పుటకు గాంధర్వ మహా విద్యాలయము (రాజమహేంద్రవరము) ఒక పాఠశాలను నిర్వహిస్తోంది. సంస్థ అభివృద్ధిచెంది తెలుగునాడులో వెలుగు చుక్క కాగలదని ఆంధ్ర మహిళ ఆశీర్వాదము.

పై ఛాయా చిత్రములలో మొదటిది విద్యార్థినులు; రెండవది విద్యాలయములో నాట్యము నభ్యసిస్తున్న కుమారి లక్ష్మి. ఈమె స్వర్గీయ దేవత శ్రీ రామమూర్తిగారి మనుమరాలు.